క్లుప్తంగా

సమయపాలన పాటించాలి



ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంతా సమయ పాలన పాటించాలని, రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో)డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆయన బుచ్చిరాజుపాలెం, లక్ష్మీనగర్, స్వతంత్రనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను(యూపీహెచ్‌సీ) సందర్శించారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆరోగ్య పథకాలపై అవగాహన ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఎస్‌లో ఉత్తమ చైర్మన్‌గా వెంకటరెడ్డి



కల్నల్ ఎస్.ఎస్. షిండే చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకటరెడ్డి

కంచరపాలెం: మిలటరీ ఇంజినీర్ సర్వీస్ (ఎంఈఎస్)లో 'ఎంఈఎస్ డే-2025'ను పురస్కరించుకుని సీడబ్ల్యూ అండ్ ఆల్ ర్యాంక్స్ నేతృత్వంలో ఎంఈసీ బిల్డర్స్ ఆసోసియేషన్ ఇండియా సభ్యులకు ఉత్తమ అవార్డులు ప్రదానం చేశారు. ఎంఈఎస్ కార్యాలయంలో శుక్రవారం కల్నల్ ఎస్.ఎస్. షిండే చేతుల మీదుగా ఉత్తమ చైర్మన్ అవార్డు వెంకటరెడ్డి అందుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ చైర్మన్ సూరిబాబు, వైస్ చైర్మన్ ఎస్.రాజశేఖర్, ఎంవీ రమణ, బి.వేణుగోపాల్, రామ ప్రసాద్‌రెడ్డి, సి.బాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవికి విశేషార్చనలు



రాజరాజేశ్వరి అలంకరణలో లలితాదేవి

మురళీనగర్: మురళీనగర్ రామాలయ ప్రాంగణంలోని లలితాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు దశమి సందర్భంగా వైభవంగా ముగిశాయి. అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి విశేషార్చనలు, సహస్ర కుంకుమార్చన చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి కలశ ఉద్వాసన నిర్వహించారు. ఆలయ అర్చకుడు బి.ప్రసాద శర్మ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేడుకగా ధ్యాన మందిర వార్షికోత్సవం



భక్తులకు రుద్రాక్షలు, విభూది పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిర 31వ వార్షికోత్సవం దసరా పండగ రోజున ఘనంగా నిర్వహించారు. గత నెల 30న ప్రారంభమైన వేడుకలు ఈ నెల 2 వరకు సాగాయి. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు బాబాకు క్షీరాభిషేకం, కాశీ, హరిద్వారల నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం హారతి అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. బాబా వారి 107వ మహాసమాధి(పుణ్యతిథి) సందర్భంగా భక్తుల స్వహస్తాలతో దీపారాధన చేశారు. షిర్డీసాయి సేవా సమితి సభ్యులచే బాబా భజన, షిర్డీ నుంచి తీసుకొచ్చిన విభూది, కాశీ హరిద్వారాల నుంచి తీసుకొచ్చిన పంచముఖి రుద్రాక్షలు, కంకణాలు, బాబా ఫొటోలను భక్తులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా జడ్జి నిడుమోలు లక్ష్మి, చైల్డ్ కమిషన్ మెంబర్ గొండు సీతారాం పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం



కిన్నెర మెస్ వెనుక రాళ్లుతేలిన శాంతిపురం రోడ్డు

- 25వ వార్డులో అధ్వానంగా రహదారులు
- గోతులు, రాళ్లు తేలి ప్రమాదాలకు నిలయమైన వైనం
- నరకప్రాయంగా ప్రజల రాకపోకలు



శాంతిపురంలో ప్రధాన రహదారి దుస్థితి

సీతంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించడం లేదని జనం మండి పడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు గోతులతో శిథిలమై ప్రమాదకరంగా మారినా.. వాటిని బాగుచేసే దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి రహదారులు అధ్వానంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు వాటి పునరుద్ధరణకు కృషి చేయడం లేదని స్థానికులు, వాహన చోదకులు విమర్శిస్తున్నారు.

జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట, శాంతిపురం, శంకరమఠం ప్రాంతాల్లోని రహదారుల్లో ఏర్పడిన గోతులతో జనం చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారులు, డ్రెయిన్లు, కల్వర్టులు, పార్కులు, గ్రీన్‌బెల్ట్‌లు, సామాజిక భవనాలు, కల్యాణ మండపాలు, వాకింగ్ ట్రాక్‌లు, స్మార్ట్ బస్టాప్‌లు నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వార్డులో కొత్తగా ఒక్క అభివృద్ధి పనికూడా చేపట్టలేదు. కనీసం ప్రధాన రహదారుల్లో గోతులను కూడా పూడ్చకుండా వదిలేశారని, దీంతో ప్రమాదాల బారిన పడుతున్నామని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీతంపేటలో శిథిలం

సీతంపేట కూడలి నుంచి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారి బాగా శిథిలమైంది. గోతులు ఏర్పడి రాళ్లుతేలిన రహదారిలో ప్రయాణించడం వాహన చోదకులకు నరకప్రాయంగా మారింది. మార్గంలో ఎక్కడ పడితే అక్కడ గోతులు, దానికి తోడు యూజీడీ మ్యాన్‌హోళ్లు రోడ్డు కంటే దిగువకు గోతుల్లా ఉండటం వల్ల స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

శాంతిపురంలో గోతులమయం

శాంతిపురంలో కిన్నెర మెస్ పక్కనున్న రహదారి అధ్వానంగా మారింది. గెడ్డపై ఉన్న బ్రిడ్జి అప్రోచ్ రోడ్ శిథిలమై కుంగిపోయి గొయ్యి ఏర్పడింది. రహదారి ఇరువైపులా చెత్తాచెదారం, డెబ్రిస్‌తో నిండిపోయింది. కిన్నెర మెస్‌కు ఆనుకొన్ని ఉన్న డ్రెయిన్ గట్లు శిథిలమయ్యాయి. హోటల్ వ్యర్థాలతో కాలువ నిండిపోయింది. కిన్నెర మెస్ వెనుక వైపు గల శాంతిపురం రహదారి రాళ్లు తేలి గోతులమయమైంది.

సీతంపేట మెయిన్ రోడ్ గురుద్వారా కూడలి నుంచి శంకరమఠానికి వెళ్లే శాంతిపురం రోడ్డు శిథిలమైంది. గోతులు ఏర్పడటం, తారు చాలా చోట్ల పోవడంతో అటుగా వెళ్లే వాహన చోదకులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో శ్రీనిధి అపార్ట్‌మెంట్ వద్ద రహదారి బాగా దెబ్బతింది. సంబంధిత అధికారులు స్పందించి వార్డులోని రహదారుల మరమ్మతులకు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



శాంతిపురంలో కిన్నెర మెస్ పక్కన అధ్వానంగా రహదారి



కిన్నెర మెస్ పక్కన గెడ్డపై కుంగిన బ్రిడ్జి



సీతంపేటలో శిథిలమైన రహదారి

వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ మెంబర్ల నియామకం



రొంగలి జగన్నాథం



బాణాల శ్రీనివాసరావు



పీలా వెంకటలక్ష్మి



పిన్నమరాజు సతీష్ వర్మ



మంతెన మాధవీ వర్మ

సీతంపేట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి ఆరుగురిని ఆ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఎస్‌ఈసీ) మెంబర్లుగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా రొంగలి జగన్నాథం, పి.వి.ఎస్.ఎన్.రాజు, బాణాల శ్రీనివాసరావు, పిన్నమరాజు సతీష్ వర్మ, పీలా వెంకటలక్ష్మి, మంతెన మాధవీ వర్మలను నియమించారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

వాల్తేర్ డివిజన్‌లో 'స్వచ్ఛతా అభియాన్'

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ వద్ద గాంధీజీ విగ్రహానికి డీఆర్‌ఎం లలిత్ బోహ్రా అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 2 నుంచి 15 వరకు వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు. రైల్వే అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పలు రైల్వే స్టేషన్లలో ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గాంధీజీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరించిన రోజు స్వచ్ఛ భారత్-స్వచ్ఛ రైలు సాధ్యమని పేర్కొన్నారు. పలు క్లీనింగ్ పరికరాల పనితీరును డీఆర్‌ఎం స్వయంగా పరిశీలించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారాం(ఇన్‌ఫ్రా), ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

సంగీత జనకులం సేవలు విశిష్టం

తాటిచెట్లపాలెం: సంగీత జనకులం సేవలు విశిష్టమైనవని, వేలాది మందికి ఉచితంగా శాస్త్రీయ సంగీతం అందిస్తున్నామని జగద్గురు పీఠం(వరల్డ్ టీచర్ ట్రస్ట్) డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. విజయదశమి సందర్భంగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్ ప్రాంగణంలో సంగీత జనకులం నిర్వహించిన సరస్వతీ పూజ, సంగీత ఉత్సవ సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. మాస్టర్ ఇ.కె. సంకల్పం మేరకు 1979లో కులపతి ఐవీఎల్ శాస్త్రి సంగీత జనకులాన్ని నెలకొల్పారని, ఇప్పటివరకు సుమారు 20 వేల మందికి పైగా శాస్త్రీయ సంగీతాన్ని అందించిన ఐవీఎల్ శాస్త్రి ఒక ఆధునిక సంగీత రుషి అని ప్రశంసించారు. సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ మాట్లాడుతూ జగద్గురు పీఠానికి సంబంధించిన రిట్రీట్ సెంటర్, మాస్టర్ హోమియో వైద్యాలయం, మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్ ప్రాంగణంలోని సంగీత జనకులంలో కొన్నేళ్లుగా సంగీతంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విజయదశమి సందర్భంగా ఉదయం నుంచి సంగీత జనకులం విద్యార్థులు త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనలను భక్తిశ్రద్ధలతో ఆలపించారు. కార్యక్రమంలో జనకులం అధ్యాపకురాలు ఇంద్రగంటి రమణీప్రసాద్, సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.



కీర్తనలు గానం చేస్తున్న సంగీత జనకులం విద్యార్థులు

రౌడీషీటర్ల హల్‌చల్

తాటిచెట్లపాలెం: నగరంలోని ప్రధాన పోలీస్ స్టేషన్లలో ఒకటైన ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో రౌడీ షీటర్ల దాడులు పెరిగాయి. ఇటీవలే పేకాడుతూ చెలరేగిన వివాదంలో ఒక రౌడీషీటర్‌ను కొట్టి, ద్విచక్ర వాహనంపై రైల్వేస్టేషన్ వరకు ఈడ్చుకెళ్లి పడేసిన ఘటన మరవకముందే, గురువారం సీతంపేట ప్రధాన రహదారిలోని బేకరి వద్ద మళ్లీ రౌడీషీటర్ల ఘర్షణ జరిగింది. రెండు వర్గాల రౌడీషీటర్లు రాడ్లు, చైన్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. నడిరోడ్డుపై జరిగిన ఈ దాడితో స్థానికులు, ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న ద్వారకా పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు, ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాల గురించిన వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత జాతిపిత

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్పొరేటర్, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతిపిత చిత్రపటానికి ఆయన పూలమాల వేసి, సేవలను కొనియాడి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుడుమూరు తిరమలరావు, పైడి ప్రతాప్, మెట్ట దమయంతి, కొత్తపల్లి రాణి, కింతలి వరహాలరాజు, ఆర్.వెంకటరమణ, యు.అప్పలరాజు, జి.పైడిరాజు, చిన్నారావు, భానుచందర్, ఆర్.గణేష్, యు.భాస్కర్ ఎర్నిబాబు, సింహాచలం, గౌరి తదితరులు పాల్గొన్నారు.



51వ వార్డులో గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

తాటిచెట్లపాలెం: గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి, ఎల్.బి.శాస్త్రి చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్ బి.అశోక్‌కుమార్, జనరల్ మేనేజర్లు వి.ఎస్.వి.రమణమూర్తి, వి.వి.ఎస్.ఎన్.వర.ప్రసాద్, పి.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీజీ, ఎల్.బి.శాస్త్రిలకు నివాళులర్పిస్తున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది

కప్పరాడ సంక్షేమ సేవా సంఘం నివాళి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడ-2 కొండవాలు ప్రాంతంలో కప్పరాడ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి గ్రామ అధ్యక్షుడు పెద్దాడ కృపారావు, ఉపాధ్యక్షుడు దొండపర్తి లక్ష్మణ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి చింతాడ సత్యానందం, సహాయ కార్యదర్శి చెంగల పేర్రాజు, పొట్నూరు అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహాత్ముడి బాటలో నడుద్దాం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. పార్కులోని గాంధీ విగ్రహానికి వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ కె.ద్వారకానాథ్ పూల మాల వేసి నివాళులర్పించారు. గాంధీ చూపిన అహింసా మార్గంలో నడుద్దామంటూ పిలుపునిచ్చారు. క్లబ్ వ్యవస్థాపకుడు ఎన్.బుచ్చయ్య, మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి, వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, కార్యదర్శి సీహెచ్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు, సహ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



వాకర్స్ పార్కులో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ద్వారకానాథ్ తదితరులు

- మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పార్కు నిర్వహణ కమిటీ, వనితా వాకర్స్ క్లబ్ సంయుక్తంగా మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు నిర్వహించారు. మహాత్ముడి విగ్రహానికి, ఎల్.బి.శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్కు ప్రతినిధులు ఎస్.వరప్రసాద్, పీవీఎస్ రాజు, మళ్ల రామకృష్ణ, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి, ఆర్‌సీ-5 ఉప్పలపాటి శుభ, సభ్యులు పాల్గొన్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో ఘనంగా త్రిరాత్రి ఉత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో దసరా త్రిరాత్రి ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పద్మావతి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు, సహస్రనామార్చన చేశారు. వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారిని ఆలయ ప్రదక్షిణ చేయించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు దసరా దశమి ప్రాధాన్యంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహా పూర్ణాహుతితో ముగిసిన మహోత్సవాలు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో పది రోజులుగా జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం శత చండీ యాగం పూర్ణాహుతితో ముగిశాయి. గత నెల 22 నుంచి ప్రతి రోజూ విశేష పూజలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దసరా రోజు ఉదయం 108 ద్రవ్యాయలతో మహా పూర్ణాహుతి, చండీ హోమం, లఘు పూర్ణాహుతి, చతుర్వేద స్వస్తితో ఉత్సవాలకు ముగింపు పలికారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పూర్ణాహుతిలో పాల్గొని హోమగుండంలో 108 ద్రవ్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ జరిపారు.



లలితా పీఠంలో మహా పూర్ణాహుతి

గాలివాన బీభత్సం



ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద కూలిన విద్యుత్ స్తంభం



అక్కయ్యపాలెం హైవేపై గ్రీన్‌బెల్ట్‌లో కూలిన చెట్టు



సంఘం ఆఫీస్ వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు కింద నుంచి ప్రయాణాలు



శంకరమఠం రోడ్డులో బేకర్స్ డెన్ వద్ద కూలిన భారీ వృక్షం



అక్కయ్యపాలెం ఎన్‌టీ స్కూల్ రోడ్డులో విరిగిన చెట్టు కొమ్మలు

- భారీ వర్షానికి నేలకొరిగిన వృక్షాలు, స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం



గాంధీనగర్ రోడ్డులో వంతెన కింద కూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న సిబ్బంది



తాటిచెట్లపాలెం - కంచరపాలెం రహదారిలో నేలకొరిగిన భారీ వృక్షం

సీతంపేట: దసరా పండగ వేళ.. గాలివాన బీభత్సం సృష్టించింది. 60 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు పలు చోట్ల చెట్లు ఉన్నపళంగా కూలిపోయాయి. మరి కొన్ని చోట్ల పెద్ద పెద్ద కొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏకధాటిగా కురిసిన భారీ వర్షం మరోమారు హుద్‌హుద్ తుఫాన్‌ను తలపించింది. పండగ జరుపుకోవడానికి సన్నద్ధమవుతున్న జనాన్ని కాలు బయట పెట్టలేక ఇంటికే పరిమితం చేసింది. తెల్లవారుజాము 3 గంటల నుంచి దసరా రోజు గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య వీచిన గాలులకు చెట్లు పేకమేడల్లా నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్, కేబుల్ వైర్లు తెగిపడి రోడ్డుపై ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ సరఫరా, కేబుల్ ప్రసారాలు నిలిచిపోయాయి. మరోపక్క వాహన పూజలు చేయడానికి వీలు లేకుండా వర్షం కురవడంతో జనం ఇబ్బంది పడ్డారు. సీతంపేట, శ్రీనగర్, ద్వారకానగర్, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం, లలితానగర్, సంఘం ఆఫీస్, ఎన్జీజీవోస్ కాలనీ, రామకృష్ణానగర్ ప్రాంతాల్లో, గ్రీన్‌బెల్ట్‌లో పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఎవరికీ ఎటువంటి నష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వర్షం తగ్గుముఖం పట్టాక జీవీఎంసీ హార్టికల్చర్ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించి మార్గం సుగమం చేశారు.

కొండవాలులో కుప్పకూలిన చెట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 46, 47, 48, 55 వార్డుల్లోని కంచరపాలెం, తాటిచెట్లపాలెం, కైలాసపురం, ఊర్వశి కూడలి తదితర కొండవాలు ప్రాంతాల్లో గాలివాన బీభత్సానికి భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు కుప్పకూలాయి. కప్పరాడ, రాంజీ ఎస్టేట్, మధుసూదన్‌నగర్, శాంతినగర్, న్యూ శ్రీనివాస్‌నగర్, ఇందిరానగర్, బర్మా క్యాంప్ తదితర ప్రాంతాల్లో రాకపోకలకు స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైర్లు తెగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం కూడలికి వెళ్లే వీఐపీ రోడ్డులో భారీ చెట్టు నేలకొరిగింది. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్‌ను ఆనుకుని పాదచారుల వంతెన మార్గంలో భారీ వృక్షం విద్యుత్ స్తంభాలపై కూలడంతో వైర్లు తెగిపడ్డాయి. ఏపీఈపీడీసీఎల్ కంచరపాలెం జోన్-2 ఈఈ బి.కె.నాయుడు పర్యవేక్షణలో సిబ్బంది విరిగిన స్తంభాలు, తెగిన విద్యుత్ వైర్ల తొలగింపు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు.



కప్పరాడలో ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడిన చెట్టు



రాంజీ ఎస్టేట్‌లో కూలిన చెట్టు